క్లుప్తంగా

నేడు వాల్మీకి విగ్రహావిష్కరణ

పాన్‌గల్: మండలంలోని బండపల్లిలో ఆదివారం వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మాజీ జెడ్పీటీసీ రామ్మూర్తినాయుడు శనివారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, వాల్మీకి సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. వాల్మీకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

యువకుల రక్తదానం



పెబ్బేరు రూరల్: పట్టణానికి చెందిన ఎంఐఎం మండల అధ్యక్షుడు ఎండీ అఫ్రోజ్ యువసేన ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. అఫ్రోజ్ పుట్టినరోజు సందర్భంగా 30మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో జాకీర్, ఆరిఫ్, మస్తాన్, సమీర్, మొహమ్మద్, హాజీ, అఫ్జల్, మునీర్, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

వైద్యుల సూచనలు పాటించాలి

పాన్‌గల్: గర్భిణులు వైద్యుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని డాక్టర్ హరినాథ్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో శనివారం ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. పీహెచ్‌సీలో మెరుగైన వైద్యంతోపాటు సాధారణ ప్రసవాలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు తైక్వాండో పోటీలు

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని యాదవ సంఘం భవనంలో ఆదివారం ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి జి.సురేందర్‌రెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. అండర్–14, 17, 19 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు ఉంటాయని, క్రీడాకారులు ఒరిజినల్ బోనఫైడ్, ఆధార్, ఫొటోలతో హాజరు కావాలని కోరారు.

ఉద్యోగులకు సన్మానం



పెబ్బేరు రూరల్: వనపర్తి జిల్లా కేంద్రంలో శనివారం మాదిగ జాగృతి సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ ఉద్యోగులను ఘనంగా నిర్వహించారు. అంతకుముందు సంఘం సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ఆది వెంకట్ మహరాజ్ మాట్లాడుతూ ఆహార నియమాలు, మాదిగ జాతి సంస్కృతీ సంప్రదాయాలు పాటించాలని కోరారు. గడపగడపకు ఎంజేఎస్‌ను చేర్చాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గణేషన్ మహరాజ్, వెంకటరమణమ్మ, సంధ్యారాణి పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

ఆత్మకూర్: మండలంలోని మూలమల్లకు చెందిన బండలయ్య–సువర్ణ కుమారుడు ప్రశాంత్, కురుమూర్తి–లలిత కూతురు రోషిణి నీట్‌లో సత్తా చాటి ఎంబీబీఎస్ సీట్లు సాధించారు. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మూలమల్ల అంబేద్కర్ సంఘం నాయకులు విద్యార్థులను శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో మన్యం, బాలకిష్టన్న, సుధాకర్, రాజు, దేవదాసు, శ్రీను, సురేష్, వెంకటన్న పాల్గొన్నారు.

తానా కవి సమ్మేళనంలో పాల్గొన్న నాయికంటి

వనపర్తిటౌన్: తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా ఉత్తర అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ కవి సమ్మేళనంలో వనపర్తి పట్టణానికి చెందిన నాయికంటి నర్సింహాశర్మ పాల్గొన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి 56 మందిని ఎంపిక చేయగా, వనపర్తి జిల్లా నుంచి నర్సింహాశర్మకు అవకాశం లభించింది. ఆన్‌లైన్‌లో నిర్వహించిన కవి సమ్మేళనంలో ఆయన పాల్గొని కవితలను వినిపించారు.

బాబోయ్ పాములు

- భయాందోళనలో ఎస్సీ గురుకుల విద్యార్థులు

కొత్తకోట రూరల్: పట్టణ శివారులోని వీపనగండ్ల ఎస్సీ గురుకుల పాఠశాల పరిసరాల్లో పాముల సంచారంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. నెలరోజుల కిందట ఓ విద్యార్థికి పాము కాటేయగా, సకాలంలో ఆస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స అందించడంతో కోలుకున్నాడు. శనివారం ఐదో తరగతి విద్యార్థి నిఖిల్ బహిర్భూమికి వెళ్లగా, పాము కాలుపై వెళ్లింది. దీంతో ఆందోళన చెందిన విద్యార్థి.. ఉపాధ్యాయులకు చెప్పడంతో వెంటనే వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పాముకాటు వేయలేదని, విద్యార్థి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు చెప్పారని ప్రిన్సిపాల్ దయాకర్ తెలిపారు. పాఠశాల చుట్టూ కంపచెట్లు, వ్యవసాయ పొలాలు ఉండటంతో విషపురుగులు సంచరిస్తున్నాయని పేర్కొన్నారు.

బీటీరోడ్డు కల నెరవేరేనా?

- అధ్వానంగా మారిన ధర్మాపురం రోడ్డు
- నిధులు మంజూరైనా.. నిర్మాణానికి నోచుకోని వైనం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్తులు
- పట్టించుకోని పాలకులు



అధ్వానంగా మారిన ధర్మాపురం రోడ్డు

అమరచింత: దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించలేదన్న చందంగా మారింది ధర్మాపురం గ్రామస్తుల పరిస్థితి. గ్రామానికి బీటీరోడ్డు నిర్మించేందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేసినప్పటికీ టెండర్ల ప్రక్రియ ముందుకు సాగడంలేదు. దీంతో గ్రామస్తుల బీటీరోడ్డు కల కలగానే మారింది. అమరచింత మండలంలోని ధర్మాపురం గ్రామానికి బీటీరోడ్డు లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో 167 నివాసగృహాలు ఉండగా, 907మంది జనాభా ఉంది. మొత్తం 644మంది ఓటర్లు ఉన్నారు. సుమారు 75మంది విద్యార్థులు అమరచింత, కొత్తకోట, ఆత్మకూర్ ఇతర పట్టణాల్లో విద్యనభ్యసిస్తున్నారు. అమరచింత ప్రధాన రహదారి నుంచి గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారడంతో రాకపోకలు సాగించలేక అవస్థలు పడుతున్నారు. అత్యవసర సమయంలో అంబులెన్స్ కూడా రాలేని విధంగా రోడ్డు మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీటీరోడ్డు లేక రవాణా సౌకర్యం అంతంతమాత్రంగా ఉందని వాపోతున్నారు. ప్రధాన రహదారి నుంచి కేవలం రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామానికి బీటీరోడ్డు నిర్మించడంపై పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ముందుకు సాగని టెండర్ల ప్రక్రియ..

ధర్మాపురం గ్రామానికి బీటీరోడ్డు నిర్మించేందుకు ప్రభుత్వం రూ.20లక్షలు మంజూరు చేసింది. సంబంధిత అధికారులు టెండర్లకు ఆహ్వానించినప్పటికీ కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు. నిధులు మంజూరై రెండేళ్లవుతున్నా ఫలితం లేకుండాపోతోంది. కొన్నేళ్లుగా బీటీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరవుతున్నాయే తప్ప.. పనులను మాత్రం చేపట్టడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి బీటీరోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



రోడ్డు అధ్వానంగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు సరిగా లేకపోవడంతో ఆటోలు ఇతర వాహనాలను నడపడంలేదు. అత్యవసర సమయంలో ఊరి నుంచి వెళ్లలేని పరిస్థితి ఉంది. గ్రామానికి రోడ్డు వేస్తామని కొన్నేళ్ల కిందట చెప్పారు. ఇప్పటి వరకు వేయలేదు. రోడ్డు సమస్యను పరిష్కరించాలి.

– అనంతమ్మ, ధర్మాపురం

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం..



గ్రామానికి రహదారి నిర్మించాలని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి విన్నవించాం. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో రూ.20లక్షలు మంజూరయ్యాయి. రోడ్డు పనుల్లో జాప్యం అవుతోంది. టెండర్ల ప్రక్రియను త్వరగా పూర్తి చేసి రోడ్డు పనులను ప్రారంభించాలి. విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం.

– గోపిరెడ్డి, సర్పంచ్, ధర్మాపురం

టెండర్లు ఆహ్వానిస్తున్నాం..

ధర్మాపురం గ్రామానికి బీటీరోడ్డు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపగా, నిధులు మంజూరయ్యాయి. రోడ్డు పనుల కోసం టెండర్లను ఆహ్వానిస్తున్నాం. కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు. మరోమారు టెండర్లు వేస్తాం. బీటీరోడ్డు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్, ఈఈ, పీఆర్

పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఏఐసీసీ కార్యదర్శి చిన్నారెడ్డి

ఆత్మకూర్: మక్తల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని రాష్ట్ర అధికార ప్రతినిధి, గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజుగౌడ్, పేట డీసీసీ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి, రేయిన్‌బో విష్ణువర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సికింద్రాబాద్‌లో నియోజకవర్గ నాయకులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అధికార బీఆర్‌ఎస్, బీజేపీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే సంక్షేమ పథకాలను వివరించాలని తెలిపారు. సమావేశంలో అయ్యూబ్ ఖాన్, నర్సింహులు, మహేందర్‌రెడ్డి, పరమేష్, అరుణ్‌కుమార్, కేశవ్‌యాదవ్ ఉన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రానికి చెందిన గంగాధర్, మద్దిలేటి సొంత గూటికి చేరారు. బీఆర్‌ఎస్‌లో చేరి 24గంటలు గడవకముందే కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్ గాంధీ భవన్‌లో వారికి ఏఐసీసీ కార్యదర్శి చిన్నారెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్‌యాదవ్, రాములుయాదవ్, విజయవర్ధన్‌రెడ్డి, బి.విష్ణు, గోవిందు, నర్సింహ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో యువతకు పెద్దపీట



యువ సమ్మేళనంలో పాల్గొన్న నాయకులు

ఖిల్లాఘనపురం: బీఆర్‌ఎస్‌లో యువతకు పెద్దపీట వేసినట్లు సర్పంచ్ రాంరెడ్డి, పార్టీ యూత్ అధ్యక్షుడు మల్లేశం అన్నారు. మండలంలోని ఉప్పరిపల్లిలో శనివారం బీఆర్‌ఎస్ యువ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు యువత సమిష్టిగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాల్‌రాజు, బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షుడు సుధాకర్, యూత్ అధ్యక్షుడు సన్నత్‌కుమార్, ఆంజనేయులుగౌడ్, శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ జాబితాలో చేర్చే వరకు పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న దేవరాజు

మదనాపురం: వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చే వరకు పోరాటం సాగిస్తామని తెలంగాణ వడ్డెర సంఘం, చారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుంచపు దేవరాజు అన్నారు. ఈనెల 11న జిల్లా కేంద్రంలో చేపట్టనున్న బైక్ ర్యాలీపై శనివారం మండల కేంద్రంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డెరులు అన్ని రంగాల్లో వెనుకబడ్డారని, ఎస్టీ జాబితాలో చేర్చడం వల్ల కొంత మేలు చేకూరుతోందన్నారు. వడ్డెరుల ఆకాంక్ష మేరకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో చేపట్టిన బైక్ ర్యాలీలో వడ్డెరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పస్పుల స్వామి, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్, నియోజకవర్గ అధ్యక్షుడు కృష్ణయ్య, శాంతయ్య, శేఖర్ ఉన్నారు.

అమరులను స్మరించుకోవడం అందరి బాధ్యత



మట్టి సేకరిస్తున్న బీజేపీ నాయకులు

ఖిల్లాఘనపురం: దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరులను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని బీజేపీ ఓబీసీమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం, జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో మేరీ మట్టి.. మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా అమృత కలశయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రాజధానిలో అమరుల స్మారక స్థూపం నిర్మాణానికి అన్ని గ్రామాల నుంచి మట్టి సేకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నవీన్‌రెడ్డి, రాంరెడ్డి, ఆశన్న, ఆంజనేయులు, శివశంకర్, సత్యనారాయణ, గోపాల్‌రెడ్డి, సుంకరి ఆంజనేయులు, రాంచందర్, భద్రయ్య, ఈశ్వరయ్య, ఆదమ్మ, శాంతి, శివ, శాంతయ్య, కేశన్న పాల్గొన్నారు.

పోచకు డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న రవీందర్‌రెడ్డి

వనపర్తి: జిల్లా కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త పోచ రవీందర్‌రెడ్డికి కేంబ్రిడ్జ్ డిజిటల్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. 16ఏళ్లుగా చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలకుగానూ శనివారం డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు పోచ రవీందర్‌రెడ్డి తెలిపారు.

వ్యవసాయ కూలి రేట్లను సవరించండి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అమరచింత: వ్యవసాయ కూలి రేట్లను సవరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు అజయ్ కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక తహసీల్దార్ చాంద్‌పాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1948 చట్టం ప్రకారం వ్యవసాయ కూలీలకు కనీస వేతనాల జీఓను సవరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోతున్న తరుణంలో వ్యవసాయ కూలీలకు రేట్లు పెంచేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహేందర్, బెక్కం విష్ణు, రమేష్, లక్ష్మణ్, దిలీప్, హన్మంతు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత.. ప్రజాకవి కాళోజీ



వనపర్తిలో కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

వనపర్తిటౌన్: తెలంగాణ వైతాళికుడు కాళోజీ నారాయణ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో కాళోజీ జయంతి, తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శంకర్‌గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ భాష, యాస, అస్తిత్వం కోసం పోరాడిన కాళోజీని నేటి కవులు, సాహితీవేత్తలు స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. అదేవిధంగా టీజీఏసీ ఆధ్వర్యంలో స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో కాళోజీ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రజావాగ్గేయకారుడు రాజారాంప్రకాష్, సాహితీవేత్తలు నారాయణరెడ్డి, జనజ్వాల, సత్తార్, భైరోజు చంద్రశేఖర్, ఉప్పరి తిరుమలేష్, నాగరాజు, శ్యాంసుందర్, నాగేంద్రగౌడ్, డి.రాములు, రామిరెడ్డి, స్వామి, శ్రీనివాసులు, ప్రవీణ్ కుమార్, నాగేంద్రం, కవులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: పట్టణంలోని విశ్వభారతి ఉన్నత పాఠశాలలో ప్రజాకవి కాళోజీ నారాయణ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య సభ్యులు బాల్‌రాజు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం

ఆత్మకూర్: కోర్టు కేసుల పరిష్కారానికి రాజీమార్గమే రాజమార్గమని మున్సిఫ్ కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి వై.జానకి అన్నారు. పట్టణంలోని మున్సిఫ్ కోర్టులో శనివారం మెగా లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. క్షణికావేశానికి లోనై కేసులు పెట్టుకొని కోర్టుల చుట్టూ తిరగడం వల్ల సమయం వృథా అవుతుందన్నారు. లోక్ అదాలత్‌లో వివిధ రకాల కేసులకు సంబంధించి రూ.10.21లక్షల జరిమానా విధించగా, 634 కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వై.తిప్పారెడ్డి, జీకే రాములు, న్యాయవాదులు శంకర్‌లింగం, నారాయణగౌడ్, దివాన్జీ అశోక్‌కుమార్, గంగాధర్‌గౌడ్. రామేశ్వర్‌రెడ్డి, బీవీ రత్నం, విజయభాస్కర్‌రెడ్డి, ముక్తేశ్వర్, ఏపీ రాజేందర్, కృష్ణ, కిశోర్, విజయ్‌కుమార్, అశోక్‌గౌడ్, అబ్రహం, మన్యం, వినోద్, శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది రూప, రాణి, విద్యావతి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మదనాపురం: మండలంలోని తిర్మలాయపల్లికి చెందిన గిర్రన్న రోడ్డు ప్రమాదంలో గాయపడి, మహబూబ్‌నగర్ ఎస్‌వీఎస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ పద్మావతి, బీఆర్‌ఎస్ నాయకులు ఆస్పత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. వైద్యఖర్చుల నిమిత్తం రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటనారాయణ, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు రవీందర్‌రెడ్డి, నాగన్నయాదవ్, మాజీ వైస్‌ఎంపీపీ శంకర్‌యాదవ్ పాల్గొన్నారు.

వనపర్తిటౌన్: టీడీపీ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న చింతకుంట దాసు భార్య కృష్ణమ్మ శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డి సూచన మేరకు రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. బి.రాములు, సయ్యద్, జమీల్, గౌస్, మహమ్మద్, దస్తగిరి, రమేష్, మహ్మద్ ఖాదర్, శంకర్‌యాదవ్, బాలరాజు పాల్గొన్నారు.

సైబర్ కేసు నమోదు

వనపర్తి: జిల్లా కేంద్రానికి చెందిన ఓ విద్యార్థి సైబర్ నేరగాళ్లతో మోసపోయాడు. పట్టణ ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి వివరాల ప్రకారం.. బీటెక్ విద్యార్థి నరహరి వంశీకృష్ణకు జూన్ 28న బిట్‌కాయిన్స్ ఇస్తామని ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దీన్ని నమ్మిన విద్యార్థి.. మూడు విడుతలుగా రూ.6వేలు చెల్లించాడు. ఇచ్చే కొద్దీ డబ్బులు అడుగుతుండటంతో అనుమానం వచ్చి, ఆ నంబర్‌కు ఫోన్ చేయగా.. లిఫ్ట్ చేయకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించారు. వెంటనే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశాడు. శనివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వాల్‌పోస్టర్ విడుదల

కొత్తకోట: సగర సంఘం ఆధ్వర్యంలో ఈనెల 11న చేపట్టిన చలో కోకాపేటకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం పట్టణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సగర సంఘం అధ్యక్షుడు బుచ్చన్న మాట్లాడుతూ కోకాపేటలో సగర కుల ఆత్మగౌరవ భవన నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేయనున్నట్లు తెలిపారు. సగరులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. సురేష్‌సాగర్, జనార్దన్, బాలశివుడు, శ్రీనివాసులు, నరేందర్, రామాంజనేయులు, కురుమూర్తి, రాజు, కృష్ణ పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ

వనపర్తి: జిల్లా కేంద్రంలోని సాయినగర్ కాలనీలో తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. స్థానికుల కథనం మేరకు.. ఇంటి యజమాని ఫారూక్ ఉద్యోగరీత్యా గుజరాత్‌లో ఉంటున్నాడు. ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గుర్తించిన దండగులు.. అర్ధరాత్రి సమయంలో ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడ్డారు. ఇంటి యజమాని వస్తేనే ఏ వస్తువులు చోరీకి గురయ్యాయో తెలుస్తాయని, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి తెలిపారు.

కేసు నమోదు

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణంలోని లక్ష్మీనరసింహ కాలనీలో గురువారం అర్ధరాత్రి జరిగిన చోరీపై శనివారం కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ నాగన్న తెలిపారు. ఇంటి తలుపులను ధ్వంసం చేసి 3తులాల బంగారు ఆభరణాలు చోరీ చేశారని, బాధితుడు తిరుపతయ్య ఫిర్యాదు మేరకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు ఇవ్వాలి

ఆత్మకూర్: సంక్షేమ వసతిగృహాల విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని బీసీ హాస్టల్ విద్యార్థులను కలిసి సమస్యలను తెలుసుకున్నారు. బీసీ, ఎస్సీ వసతిగృహాల్లో విద్యార్థులకు నాలుగు నెలలుగా కాస్మోటిక్ చార్జీలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రమేష్, శంకర్, శేఖర్, సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నాయకుల అరెస్ట్

పెబ్బేరు రూరల్: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం సందర్శనకు వెళ్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వనపర్తి, పెబ్బేరు, శ్రీరంగాపురం మండలాల్లో పార్టీ నాయకులను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు.

పాన్‌గల్: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం సందర్శనకు వెళ్తున్న మాజీ మంత్రి జూపల్లికి మద్దతుగా బయల్దేరిన కాంగ్రెస్ పార్టీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

ఖిల్లాఘనపురం: అరెస్టులతో ప్రజా ఉద్యమాలను అడ్డుకోలేరని వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జయాకర్ అన్నారు. జూపల్లి కృష్ణారావుకు మద్దతుగా పాలమూరు ఎత్తిపోతల సందర్శన చేపట్టిన నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అమరచింత: బీఆర్‌ఎస్ ప్రభుత్వం సమస్యలను గాలికొదిలేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ బీసీసెల్ మండల అధ్యక్షుడు విష్ణు అన్నారు. పార్టీ నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించడం సరికాదన్నారు. సీఎం కేసీఆర్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

వీపనగండ్ల: నియోజకవర్గంలోని నార్లాపూర్ రిజర్వాయర్ సందర్శనకు వెళ్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎత్తిపోతల పథకం పనులు పూర్తి కాకముందే ప్రారంభించడం రైతులను మోసం చేయడమేనని కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు.

ఆత్మకూర్: కాంగ్రెస్ నాయకుల అరెస్టు అప్రజాస్వామికమని పలువురు ధ్వజమెత్తారు. మండలంలోని కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

చిన్నంబావి: పాలమూరు ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించేందుకు వెళ్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా పెద్దదగడకు చెందిన ఉపాధ్యాయుడు వెంకటేష్‌ను పోలీసులు అరెస్టు చేయడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై ఎస్‌ఐని వివరణ కోరగా, కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కార్యక్రమానికి వెళ్తున్నారన్న సమాచారం మేరకు అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఉపాధ్యాయుడు సాక్షితో మాట్లాడుతూ తన భార్య ఎంపీటీసీ అని, తనను ఎందుకు అరెస్టు చేస్తున్నారని ప్రశ్నించినప్పటికీ వినకుండా పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారని పేర్కొన్నారు. తనను కావాలనే ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



సింగంపేట అడవి ఆంజనేయస్వామి ఆలయంలో..

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి దత్తకోటి లింగేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి ఏకరుద్రాభిషేకం నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకుడు శేఖరయ్య తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అమరచింత: మండలంలోని సింగంపేట అడవి ఆంజనేయస్వామి సప్తాహ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని కృష్ణాజలాలతో అభిషేకించారు. గ్రామస్తులు కుటుంబ సమేతంగా వేడుకల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్వీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరేష్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.ఎ.రాజు, సర్పంచ్ విజయలక్ష్మి, చంద్రశేఖర్‌రెడ్డి, రమేష్ ముదిరాజ్, అక్కల నర్సింహులుగౌడ్, మాజీ జెడ్పీటీసీ రాజేందర్‌సింగ్, నాగభూషణం గౌడ్, రమేష్ పాల్గొన్నారు.

ఆత్మకూర్: వర్షాల కోసం బాలకిష్టాపూర్ గ్రామ రైతులు ప్రత్యేక పూజలు చేశారు. 20 ట్రాక్టర్లలో కృష్ణానది నుంచి నీటిని తీసుకొచ్చి అభయాంజనేయస్వామికి అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ తుకారాంనాయక్, మాజీ సర్పంచ్ సత్యన్న, చిరంజీవి, మాసన్న, డాక్యానాయక్, రాజు, రమేష్ పాల్గొన్నారు. అదేవిధంగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో ఆత్మకూర్, బాలకిష్టాపూర్ గ్రామాల్లో శ్రీకృష్ణ భగవానుడి విగ్రహంతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో విజయభాస్కర్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, బాలకృష్ణ, శేఖర్‌రెడ్డి, రాములు, శివ, మాసన్న, పురుషోత్తం, తిరుమలేష్, నరేందర్‌రెడ్డి, సత్యం, శైలజ, జ్యోతి, మంజుల, లయ, ప్రమీల, అనిత పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో కృష్ణాజలాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న బాలకిష్టాపూర్ గ్రామస్తులు



కానాయపల్లి దత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో..